శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త







## అట్టహాసంగా 77వ గణతంత్ర దినోత్సవ సంబరాలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన
- విశిష్ట సేవలందించిన 737 మందికి ప్రశంసాపత్రాలు పంపిణీ
- స్టాళ్లను సందర్శించిన కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని పోలీసు పరేడు మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కోవూరు జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థినులు దేశభక్తిని పెంపొందించేలా దేశమంటే మట్టికాదోయ్ నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. ముత్తుకూరు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల హమారా హిందుస్తానీ నృత్యప్రదర్శన ఆలోచింపజేసింది. తొలిసారిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు చేసిన సర్కారుబడి గొప్పతనం తెలిపేలా ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ప్రభుత్వ పాఠశాలల ఔన్నత్యాన్ని చాటింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వెజెండ్ల విద్యార్థులను అభినందిస్తూ మెమెంటోలను అందించారు.

**రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన వివిధ శాఖల శకటాలు**

రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ సాగిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శకటం, జిల్లా నీటి యజమాన్య సంస్థ శకటం, నెల్లూరు నగరపాలక సంస్థ శకటం, గృహ నిర్మాణ శాఖ శకటం, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, స్వర్ణకారుల శకటం, జిల్లా పర్యాటకశాఖ, పరిశ్రమలశాఖ, విద్యుత శాఖ శకటాలు ఆకట్టుకున్నాయి. ఈసారి ప్రత్యేకంగా నెల్లూరుజిల్లా స్వర్ణకారుల గొప్పతనం, నైపుణ్యం వివరించే స్వర్ణకారుల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో డిఆర్‌డిఏ శకటానికి మొదటిస్థానం, వ్యవసాయశాఖకు ద్వితీయస్థానం, మున్సిపల్, టూరిజం శాఖలకు తతీయస్థానం లభించగా, స్వచ్ఛాంధ్ర, స్వర్ణకారుల శకటాలకు కన్సోలేషన్ బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

**స్టాళ్లను సందర్శించిన కలెక్టర్**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు కవాతు మైదానంలో వివిధ ప్రభుత్వశాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజితా వెజండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు పరిశీలించారు. జిల్లా పంచాయతీశాఖ, ఐసిడిఎస్, వ్యవసాయం, ఉద్యానవనశాఖ, మెప్మా, వైద్యారోగ్యశాఖ, ఐటిడిఎ, మత్స్యశాఖ, సహకార శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించేలా ఏర్పాటుచేసిన స్టాళ్లు అందరిని ఆకట్టుకున్నాయి. ఆయశాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

**ఆస్తులు పంపిణీ చేసిన కలెక్టర్**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం ఎగ్‌కార్ట్స్‌ను మహిళలకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందించారు. 18 మంది లబ్ధిదారులకు రూ.35వేలు విలువ కలిగిన ఎగ్‌కార్టు, రూ.15వేలు విలువ గల వంటపాత్రలు మొత్తం రూ. 50వేలు విలువ గల యూనిట్‌ను 100శాతం సబ్సిడీతో స్వయంసహాయక సంఘాల్లో మహిళలకు అందించారు. మొత్తం 9లక్షల విలువైన ఎగ్‌కార్ట్‌లను అందించారు. ఈ ఎగ్‌కార్ట్స్ ద్వారా గుడ్లు ద్వారా తయారుచేసే ఆహార పదార్థాలతో ప్రజలకు పౌష్టికాహారంగా గుడ్డు వినియోగించడాన్ని ప్రోత్సహించడంతో పాటు మహిళలకు ఉపాధి లభిస్తుందని డిఆర్‌డిఎ పీడీ నాగరాజకుమారి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో 5 లాప్‌టాప్స్, 20 స్మార్ట్ ఫోన్లను దివ్యాంగులకు కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఒక్కొక్క లాప్‌టాప్ విలువ రూ.42 వేలు కాగా, స్మార్ట్‌ఫోన్ విలువ రూ.20 వేలు అని ఆ శాఖ ఎడి మహ్మద్ అయూబ్ తెలిపారు. అలాగే ఐటిడిఎ ఆధ్వర్యంలో 11మంది మత్స్యకారులకు సైకిల్, వలతో కూడిన యూనిట్లను పంపిణీ చేశారు. ఒక్కొక్క యూనిట్ విలవ రూ.10వేలు కాగా సబ్సిడీతో వీటిని అందిస్తున్న ఐటిడిఎ అధికారులు తెలిపారు.

**విశిష్ట సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు పంపిణీ**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి, వివిధ రంగాల్లో ప్రతిభచూపిన కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

## కలెక్టరేట్లో గణతంత్ర దినోత్సవం వేడుకలు

- గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కలెక్టర్





**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త**
77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీజి విగ్రహానికి పూలమాలలు వేసి మహాత్మాగాంధీ సేవలను గుర్తుచేసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈ కార్యాక్రమం లో పాల్గొన్న డిఆర్వో విజయకుమార్, అధికారులు, సిబ్బంది 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ చేసి జెండా వందనం చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల జిల్లా కలెక్టర్ తోపాటు పాల్గొన్న డిఆర్వో విజయకుమార్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గున్నారు. అనంతరం కలెక్టర్ శుక్ల చిన్నారులకు చాక్లెట్లు స్వీట్లు పంచిపెట్టారు.

## విశిష్ట సేవలకు జేసీకు ప్రశంసాపత్రం

- జిల్లా కలెక్టర్ శుక్లచే జెసి ఎం.వెంకటేశ్వర్లకు ప్రశంసాపత్రం



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త**
జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లుకు తమ విశిష్ట సేవలు అందించినందుకు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకలలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదగా జిల్లా జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రం అందుకోవడం జరిగింది.

## కలెక్టరేట్ ఏవో టీ. విజయకుమార్‌కు ప్రశంసా పత్రం

- జిల్లా కలెక్టర్ శుక్ల చేతుల మీదగా అందుకున్న ఏఓ టీ. విజయ్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త**
జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని, ఏవో టి విజయ్ కుమార్ తమ విధులలో విశిష్ట సేవలు అందించినందుకు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకలలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదగా, జిల్లా కలెక్టర్ ఏవో టీ విజయ్ కుమార్‌కు ప్రశంసా పత్రం అందుకోవడం జరిగింది.

## జిల్లా రెవెన్యూఅధికారి ఎన్ విజయకుమార్‌కు ప్రశంసా పత్రం

- జిల్లా కలెక్టర్ శుక్ల చేతుల మీదగా అందుకున్న డిఆర్ఓ



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త**
జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ విజయకుమార్ తమ విశిష్ట సేవలు అందించినందుకు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకలలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ విజయ్ కుమార్ ప్రశంసా పత్రం అందుకోవడం జరిగింది.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు ప్రాణభిక్ష

బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి 5 లక్షల ఎల్‌వోసీ అందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**కోవూరు, జనవరి 26, ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద ప్రజలకు ప్రాణ భిక్ష పెడుతున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న మాముడూరు వేణుకు ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల ఎల్‌వోసీని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దంపతులు బాధితులకు సోమవారం అందజేశారు. మాముడూరు వెంకటస్వామి, రాజేశ్వరి దంపతుల కుమారుడు వేణు 9 ఏళ్ల వయసులో ఫిట్స్ బారిన పడ్డారు. ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా నయం కాకపోవడంతోపాటు ఆర్థిక భారం పెరిగింది. ప్రస్తుతం నారాయణ ఆసుపత్రిలో చేర్పించగా.. ఆపరేషన్ నిమిత్తం 12 లక్షల అవుతుందని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆ ఆపరేషన్ నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి 5 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆ ఎల్‌వోసీని సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించి, వారి ప్రాణాలను కాపాడుతున్న ముఖ్యమంత్రికి ఎంపీ, ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గడ్డం సుజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కావలి, జనవరి 26 ప్రభాతవార్త:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జ్ మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం గల వైసిపి కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జెండాను ఆవిష్కరించి వందనం చేయడం జరిగింది. కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, దానిశెట్టి సుధీర్‌నాయుడు, కుందుర్తి శ్రీనివాసులు, షేక్ షాహుల్ హామీద్, ఎంపి,ఎంపిపి అలూరి కొండమ్మ, కనపర్తి రాజశేఖర్, కందుర్తి కామయ్య, మండల క్రిష్ణారావు, టీచర్ క్రిష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆర్కె క్రిష్ణారెడ్డి, పేరం వెంకటేశర్లు, పరుసు మాల్యాద్రి మండల వైసిపి అధ్యక్షులు వాయిల తిరుపతి ఇర్ల సురేష్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లిలో సంస్థాగత సమావేశం




**మర్రిపాడు, జనవరి 26, ప్రభాత వార్త:** మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో సోమవారం వైఎస్ఆర్‌సిపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఉదయగిరి నియోజకవర్గ సంస్థా సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు మద్దెల గురుమూర్తి, జిల్లా పార్టీ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి లు హాజరయ్యారు. ఈసందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అతిథులందరిని శాలువాలు, బొకెలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుండి వేలాదిమంది వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం

- బాధితులకు అండగా వైకాపా
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి



**నెల్లూరు, జనవరి 26 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు నగరంలో మునుపెన్నడూలేని విధంగా అభివృద్ధి పేరుతో పేద ప్రజల నివాసాలు,దుకాణాలను తొలగిస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ,వైకాపా నగర ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక 40వ డివిజన్ మూలాపేటలో బాధిత రోడ్డు మార్జిన్ వ్యాపారులను కలసుకుని వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముందస్తు నోటీలసు జారీ చేయకుండా అబివృద్ధి పేరుతో పేదల దుకాణాలు కూలగొట్టడం దారుణమన్నారు. మంత్రి నారాయణ పేదల విషయంలో నియంతృత్వ దోరనిలో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అర్థంలేని అభివృద్ధి పనులు, అవగాహన లేని అధికారుల తీరుతో నగరప్రజలు నరకం చూస్తున్నారని ఆరోపించారు. మైపాడు గేట్ సెంటర్‌లో నిర్మించిన స్ట్రీట్‌వెండింగ్ ప్రాజక్టునిర్మాణంలో మంత్రికి ఇండ్‌టూ ఇండ్ రోడ్డు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కేవలం పేద ప్రజలపైనే మంత్రి నారాయణ కక్షకట్టుకుని ఇలా చేయటం దారుణమన్నారు. ఇక్కడ షాపులు తొలగించాల్సిన పరిస్థితి వస్తే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి దుకాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు తమ పార్టీ తరపున తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు మానికల సురేష్, మహేష్, హరిబాబు, అశోక్, పెంచలయ్య, చంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాగ స్పూర్తితో నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

కమిషనర్ వైఓ.నందన్





**నెల్లూరు కార్పోరేషన్, జనవరి 25 ప్రభాతవార్త :** మహనీయులు రూపొందించిన రాజ్యాగ స్పూర్తితో నెల్లూరు నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని కార్పోరేషన్‌లోని అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని కమిషనర్ వైఓ.నందర్ ఆకాంక్షించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకొని కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఎన్‌సిసి క్యాడెట్లు కవాతుతో కమిషనర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం మహాత్మగాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి శ్రద్దాంజలి ఘటించారు. జాతీయజెండాను కమిషనర్ ఆవిష్కరించారు. మేయర్ కార్పోరేటర్లు అన్ని విభాగాల అధికారులు సిబ్బంది జెండా వందనం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించి ప్రజలకందరికి సమాన హక్కులు కల్పించిన మహనీయులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్దతతో కృషి చేయాలని సూచించారు. ఎందరో మహనుభావుల త్యాగాలతో సాధించిన స్వతంత్ర్య స్పూర్తిని ఆదర్శంగా తీసుకొని విధుల్లో క్రమశిక్షణ పాటించాలని కమిషనర్ ఆశించారు. ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మహనీయులు రూపొందించిన ఆదర్శనీయమైన భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ విదేయత కనబరచాలని ప్రజల జీవనం కోసం మహనీయులు చూపిన మార్గాన్ని ఆచరించి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నగర పాలక సంస్థలోని వివిధ విబాగాల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి కమిషనర్ మేయర్ కార్పోరేటర్లు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో కార్పోరేటర్‌లు సత్తార్ బాషా, కరీముల్లా, రామక్రిష్ణ, నగరపాలకసంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు వార్డు సచివాలయాలు కార్యదర్శులు ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ రవాణాశాఖ అధికారిగా సుందరరావు



**కావలి, జనవరి 26 ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి ఉన్నతాధికారుల సహా ఉద్యోగుల మన్ననలు పొందిన ఎంవిఐ ఆర్.సురందరావు ఉత్తమ రవాణాశాఖ అధికారిగా జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల చేతుల మీదుగా ఉత్తమ పురష్కారాన్ని, అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, రవాణా శాఖ అధికారులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వెజండ్ల సాదర స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్ల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేసి జాతీయ గీతం ఆలపించారు. శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్ల జిల్లా ప్రగతి నివేదికను వినిపించారు. విద్య, వైద్యం, వ్యవసాయ శాఖ వంటి రంగాల వారీగా సాధించిన ప్రగతిని, లక్ష్యాలను ప్రస్తావించారు. ప్రగతి నివేదిక అనంతరం వివిధ శాఖలు తయారు చేసిన శకటాల ర్యాలీ నిర్వహించగా, విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా ప్రజలకు 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు రాజ్యాంగం అందించిన హక్కులకు సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగబద్ధ పాలనలో భాగస్వాములు కావాలన్నారు. వేడుకలలో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇంచార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, పలువురు ప్రముఖులు, జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ వైఓ.నందన్‌కు ప్రతిభ పురష్కారం



**నెల్లూరు కార్పోరేషన్, జనవరి 25 ప్రభాతవార్త :** విధుల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గానూ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురష్కరించుకొని స్థానిక పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్‌కు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్త చేతుల మీదుగా ప్రతిభా పురష్కారాలను అందుకొన్నారు.

## ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ప్రదానం



**కావలి, జనవరి 26 ప్రభాతవార్త:** 77వ గణతంత్ర దినోత్సవంను పురష్కరించుకొని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు పురపాలక సంఘం కార్యాలయం నందు కమీషనర్ శ్రావన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షన్ 2026 స్వచ్ఛ లీడర్‌షిప్ అవార్డును కోఆపరేటీవ్ కాలనీలోని ఎంఎఅస్ఆర్ డిగ్రీ కళాశాలకు అందజేయడం జరిగింది. ఈ అవార్డును కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

## సెల్ఫీ పాయింట్ వద్ద ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కావలి, జనవరి 26 ప్రభాతవార్త:** కావలి సెల్ఫీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన 100అడుగుల జాతీయ జెండాను సో మవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోదుల త్యాగాల ఫలితమే మనం స్వేచ్ఛాయుత జీవితం గడుపుతున్నామని తెలిపారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ జాతీయ జెండాను మన గర్వచిహ్నంగా బావిస్తూ ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ నాయకత్వంలో ఏపి ప్రగతిబాగలో నడుస్తొందని తెలిపారు. 2000కిలో మీటర్ల పాదయాత్ర మైలురాయికి కావలి నియోజకవర్గం సాక్ష్యంగా నిలిచిందని తెలిపారు. ఈ స్పూర్తి యాత్రను దిగ్విజయంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులు, కూటమి పారీట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తూర్పు కంభంపాడు పాఠశాలలో గణతంత్ర వేడుకలు

**చేజర్ల జనవరి 26 ప్రభాతవార్త :** చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె అరుణ జాతీయ జెండాను ఎగురవేసి వందనం స్వీకరించారు. అనంతరం



ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతు విద్యార్థి దశ నుండే దేశభక్తిని అవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు స్వాతంత్ర సాధన కోసం త్యాగాలు చేసిన నాయకుల జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. పదోవతరగతిలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్దానాలలో మార్పులు సాధించిన విద్యార్దులకు పాఠశాల పూర్వ విద్యార్దులు ఎం పెంచలయ్య రిటైడ్ నెల్లూరు డిఎంఅండ్‌హెచ్ఒ 15 వేల రూపాయాలు నగదు అందజేశారు. తూర్పు కంభంపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ నెలకొండ మురళీదర్‌నాయుడు 15 వేల నగదు అందజేశారు. మరొక దాత పదివేల నగదు అందజేయడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా టి గౌరిప్రియ,సిహెచ్ అనూష, ఎం పవన్‌నాగూర్‌ల నగదు అందజేయడం జరిగింది. బిల్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయిళ్ళ కొండారెడ్డి 77 వ గణతంత్ర దినోత్సవ సందర్బంగా జాతీయ జెండాను ఎగురవేసి వందనం స్వీకరించారు. విద్యార్దులు జాతీయ నాయకుల వేషదారణలో పలువురిని అకర్షించింది. గ్రామ సర్పంచ్ 120 మంది విద్యార్దులకు ప్లేట్లు,గ్లాసులు విరాళంగా అందజేయడం జరిగింది. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్దులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్దులు పాల్గోన్నారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు

**సంగం జనవరి 26 ప్రభాతవార్త :** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలో గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని పాఠశాలలో మువ్వెన్నల జెండాను ఎగురవే శారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జనవరి 26 యొక్క విశిష్టత చిన్నతనం నుండే పిల్లలకు తెలియ



జేయాలని అన్నారు. మన రాజ్యాంగం గొప్పతనం గురించి చెప్పాలని ఆయన వివరించారు.. ప్రధానోపాధ్యాయురాలు రోజారమణి, ఉపాధ్యాయులు రమణయ్య, ప్రసాద్, పంచాయితీ సెక్రటరీ ఉదయ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆదిశేషయ్య,అగ్రికల్చర్ అసిస్టెంట్ సుజాతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణమ్మ, ఆయా లక్ష్మీ, మీనాక్షి, అనితా, విద్యార్దులు పాల్గోన్నారు.

## ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త :** 77 వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని పంచాయితీరాజ్ కార్యాలయంలో డిఇ తుమ్మల శ్రీనివాసులురెడ్డి మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు అని ఆయన తెలిపారు.డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లాంటి మహానీయులు రాజ్యాం గాన్ని రూపొందించారని అన్నారు.నేడు ప్రతి ఒక్కరు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారంటు దానికి కారణం మన రాజ్యాంగం అని ఆయన పేర్కున్నారు.ఈ సందర్బంగా విద్యార్ధులకు మిఠాయిలు పంచిపె ట్టారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఇలు,సిబ్బంది పాల్గోన్నారు.ఎంపిడిఒ కార్యాలయంలో

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రంతుల్లయ్య మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. జనవరి 26 యొక్క విశిష్టత గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గోన్నారు.

తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. రాజ్యాంగం యొక్క గొప్పతనం గురించి వివరించారు.ప్రతి ఒక్కరు స్వేచ్ఛవాయువులు పీలుస్తున్నారంటే అందుకు కారణం రాజ్యాంగమేనని ఆయన పేర్కున్నారు.ఈ సందర్బంగా విద్యార్దులకు స్వీట్లు పంచిపెట్టారు.

సిఐ కార్యాలయంలో

బుచ్చి సిఐ కార్యాలయంలో సిఐ శ్రీనివాసులురెడ్డి మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. జనవరి 26 యొక్క విశిష్టత గురించి తెలియజేశారు.గణతంత్ర దినత్సోవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్ధులకు సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు.

## సంగంలో ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు



**సంగం జనవరి 26 ప్రభాతవార్త :** సంగం మండలంలో 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రమైన సంగంలోని తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు సోమ్లానాయక్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి ప్రజలకు గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు.అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ షాలెట్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐ శ్రీనివాసులురెడ్డి సిఐ కార్యాలయం ప్రాంగణంలో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.ఈ సందర్బంగా వారు రాజ్యాంగం యొక్క విశిష్టతను తెలియజేశారు.నేటి తరం రాజ్యాంగాన్ని గురించి తెలుసుకోవాలని అన్నారు. సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.అన్ని ప్రభుత్వ,ప్రవేటు పాఠశాలలు,బిసి హాస్టల్స్,ఎస్‌సి హాస్టల్స్ మువ్వన్నెల జెండాలతో కళకళలాడుతు కనిపించాయి.

## బుచ్చి వెలుగు కార్యాలయంలో ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు



**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం వెలుగు కార్యాలయంలో 77 వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎపిఎం డి.శ్రీదర్‌రెడ్డి మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. రాజ్యాంగం యొక్క విశిష్టత గురించి తెలియజేశారు. మన రాజ్యాంగం గొప్పతనం గురించి వివరించారు.ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకొని రావాలని ఆన్నారు. ప్రభుత్వం కూడా పొదుపు మహిళలను అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలి పారు.ఈకార్యక్రమంలో సిసిలు,పొదుపు మహిళలు పాల్గోన్నారు.

## వవ్వేరు బ్యాంకులో ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు

**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకులో ఘనంగా 77 వ గణతంత్ర వేడుకలు నిర్వహి ంచారు.ఈ సందర్బంగా సిఇఒ శ్రీనివాసులు మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగం బారత రాజ్యాంగం అని



అన్నారు.రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు.అలాగే బ్యాంకు డైరక్టర్లు మద్దిసాని మాల్యాద్రి, డైరక్టర్ కోవూరు పద్మ, టిడిపినాయకులు దొడ్ల కొదండరామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది లు పాల్గొని జెండా వందనం చేశారు. అందరికి మిఠాయిలు పంచిపెట్టారు.

## బోగోలులో ఘనంగా గణతంత్ర వేడుకలు

**బిట్రగుంట జనవరి 26 ప్రభాతవార్త** బోగోలు మండలంలో సోమవారం ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ శ్రీనివాసులరెడ్డి. బిట్రగుంట పోలీస్ స్టేషన్లో ఎస్సై ప్రభాకర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. స్వాతంత్రం కోసం పోరాటాలు



చేసిన మహనీయులని వారు స్మరించుకున్నారు. ఆయా కార్యాలయాల్లో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా ఆర్ఎస్ఆర్‌లో 77వ గణతంత్ర దినోత్సవం

బిట్రగుంట జనవరి 26 ప్రభాతవార్త బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ డిపార్ట్మెంట్ ,ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. వారు ముందుగా త్రివర్ణ పతాకమును ఎగురవేసి సెల్యూట్ చేసిన తర్వాత మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను, ఆవశ్యకతను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే. రాజారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు ప్రతి విద్యార్థిని విద్యార్థి తప్పక పాటించి దేశ శ్రేయస్సు కోసం తన వంతు కృషి చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్ వి



రమణారెడ్డి, ఈఈఈ డిపార్ట్మెంట్ హెచ్ ఓడి డాక్టర్ వి. రవీంద్రారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఏ. కిరణ్ కుమార్, అన్ని విభాగాలు అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు బీటెక్ విద్యార్థులు, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా

బిట్రగుంట జనవరి 26 ప్రభాతవార్త బోగోలు మండలం తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ సుంకే మాల్యాద్రి పేర్కొన్నారు. తాళ్లూరు గ్రామంలో రిపబ్లిక్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆయన సొంత నిధులతో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వి. వెంకట నరేంద్ర, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బహుజన సేవా సమితి ఆద్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు

**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త :** 77 వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ రోడ్డు సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి బహుజన సేవా సమితి వారు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమం బుచ్చి రెడ్డి పాళెం సంఘం సభ్యులు మరియు అద్యక్షులు పి.రాగవయ్య ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లా



డుతు రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. భారతరాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని అన్నారు.నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామంటే కారణం రాజ్యాంగమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో బి యానాదయ్య, చిన కొండయ్య, రమణయ్య, అంకులయ్య, వెంకటయ్య,శ్రీనయ్య, రామచంద్రయ్య, రాజయ్య, మున్నాభాయి, జి .శ్రీనివాసులు, హరిబాబు, తదితరులు పాల్గోన్నారు.

## ప్రైవేటు పాఠశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలు

**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రైవేటు పాఠశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు.,శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిలు డిప్యూటి డిఇఒ ఎం.కొండయ్య, పి.టి.ఒ బి సురేష్‌రెడ్డి పాల్గోన్నారు., విద్యార్ధులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిఫల్ హన్విత, ప్రిన్సిపల్ సంజయ్, హెచ్ఎం సుజాత,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి విద్యార్ధులకు రాజ్యాంగం యొక్క గొప్పతనం గురించి వివరించారు.ఎక్సెలెన్స్ స్కూల్‌లో కరస్పాండెంట్ అయబ్‌ఖాన్ మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ మువ్వన్నెల జెండా ఎగురవే శారు.ఆక్స్‌ఫర్డె ఇంగ్లీషు మిడియం స్కూల్,నేతాజి స్కూల్, విశ్వభారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్ పలు పాఠశాలలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు,చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మువ్వన్నెల జెండాను ఎగుర వేసి మిఠాయిలు పంచిపెట్టారు.





## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**చిల్లకూరు, జనవరి 26, ప్రభాతవార్త :** చిల్లకూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగం వల్లనే



మనకు స్వాతంత్రం లభించిందని, ఆ మహనీయులను భారతీయులందరం ప్రతిక్షణం స్మరించుకోవాలని, దేశం పట్ల ప్రతి పౌరుడు భక్తి భావం కలిగి ఉండాలన్నారు. అనంతరం కార్యాలయం పక్కనే ఉన్న కాలనీలోని పేద ప్రజలకు, పిల్లలకు మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, ఆధ్వర్యంలో చేతుల మీదుగా బట్టలను పంపిణీచేసి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే మండలంలోని పోలీస్ స్టేషన్ ఎంపిడిఓ ఆఫీసు, అన్ని ప్రభుత్వ సచివాలయాలు, పాఠశాలు ప్రైవేట్ పరిశ్రమలలో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి వందనం సమర్పించి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చైతన్య, నాయకులు కొండా రామచంద్రారెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి పెనుబోలు జానకి రామిరెడ్డి, సూరనేని రామచంద్ర రావు, చకర యశ్వంత్, ఓడూరు సతీష్ రెడ్డి, కీరవాణి, మూగ శంకరయ్య, మేఘనూరు వెంకట కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించండి

**చిల్లకూరు, జనవరి 26, ప్రభాతవార్త :**మండలంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట మండలంలోని గ్రామ సర్వేయర్లు వారి సమస్యలను పరిష్కరించాలని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుండి ప్రభుత్వం వారు రీ సర్వే ప్రాజెక్టు నిర్వహిస్తున్నారని, అయితే వారందరూ కూడా బీటెక్, ఎంటెక్ చదువుకుని



వచ్చారని, ఇంకా కూడా వారిని డిప్లమా గానే పెట్టి ఉన్నారని, మిగతా ఉద్యోగుల్లా వారిని గుర్తించి పే స్కేల్‌ను పెంచి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు మధుసూదన్, అరుణ్ కుమార్, భార్గవి, విశాలాక్షి, శ్రీహరి, అచ్యుత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీవో హోమ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త :** ఎన్జీవో హోమ్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా అధ్యక్షులు బందారుపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నంది మండలం ఆంజనేయ వర్మ, లక్కాకుల పెంచలయ్య, కిరణ్, మల్లికార్జున్, రాజేంద్ర, కరుణమ్మ, రాజేంద్ర, రమ్య, గిరిధర్



రవికుమార్, రమ్య, నగర అధ్యక్షులు చిలకా రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కృష్ణ కుమార్, మహిళ చైర్ పర్సన్ ఎల్ నవోదయ, కన్వీనర్ జి లక్ష్మి, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర వేడుకలు

వెంకటాచలం **జనవరి 26, ప్రభాతవార్త :** వెంకటాచలం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో కల్పన, పోలీస్ స్టేషన్లో సీఐ సుబ్బారావు, మం డలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. నిడిగుంటపాలెం గ్రామంలో సాగునీటి సంఘం అధ్యక్షులు కుంచే శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రభుత్వ కార్యాలయంలో సచివాలయంలో గణతంత్ర వేడుకలు కుంచె శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా వందనం స్వీకరించి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. భాజపా నాయకులు హస్నాపురం శ్రీనివాసులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతమైన జాతీయ చేతి వ్రాత పోటీలు

**నెల్లూరు రూరల్, జనవరి 26, ప్రభాతవార్త :** జనవరి 23వ తేదీన జాతీయ చేతి వ్రాత దినాన్ని పురస్కరించుకుని ఈ రోజు అంతర్జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అచరిత్వ ఫౌండేషన్ నెల్లూరు జిల్లా క్యాలిగ్రఫీ టీమ్ ఆధ్వర్యంలో సంఘమిత్ర నారాయణ స్కూల్ బి.వి.నగర్ నందు లూసిడా చేతివ్రాత పోటీలు నిర్వహించారు.



ఈ పోటీ ల్లో వివిధ జిల్లాల నుం డి దాదాపు 200 మంది విద్యా ర్థులు,100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో జూనియర్ మరియు సీనియర్ల విభాగంలో ప్రథమ బహుమతి 2000 రూపాయలు, ద్వితీయ బహుమతి 1500 రూ పాయలు, తృతీయ బహుమతి 1000 రూపాయలు మరియు కన్సొలేషన్ బహుమతులు, మెమెంటో ప్రశంసా పత్రాలు సి.జి.యస్.టి కమీషనర్ డా. సి.హెచ్.ఉషాకిరణ్ రాయ్ గారు అందజేశారు. ఈ కార్యక్రమంలో అచరిత్వ ఫౌండేషన్ వ్యవస్థాపక అద్యక్షులు. పి.జీ.డి కృపాల్, సంఘమిత్ర నారాయణ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు రవీంద్రారెడ్డి మరియు క్యాలిగ్రఫీ ఫ్యామిలీ మెంబెర్స్ జి.ఎల్.రత్నశేఖర్, అరవ పద్మజా, కె.సుహాసిని, స్టెల్లా మేరి, రమణి, యెషయా, పాల్ సుధాకర్, మోటివేషనల్ స్పీకర్ డొమినిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

బిట్రగుంట జనవరి 26 ప్రభాతవార్త విజయవాడ రైల్వేడివిజన్ బిట్రగుంట రైల్వే ఇన్స్టిట్యూట్ లో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్ సెక్రటరీ మల్లికార్జున రావు మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్ అభివృద్ధికి పై స్థాయి రైల్వే అధికారులను విన్నపం చేయడం జరిగింది వారు కూడా స్పందించి త్వరలో ఇన్స్టిట్యూట్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రైల్వే డాక్టర్ ఐ వి రమణ రావు, ఎస్ ఎస్ మురళీధర్ రెడ్డి, పిడఖ్యు రాజ్కుమార్, సిఎండబ్ల్యూ విజయవర్ధన్, ఎస్సీ ఎస్టీ సెల్ సెక్రెటరీ చైత్ర మీనా, బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీఉల్లా, మరియు వాకర్స్ అసోసియేషన్ తరుపున నూక సాని శ్రీనివాస్ యాదవ్ రైల్వే కార్మిక నాయకులు జీవన్ కుమార్ బెర్నార్డ్ కుందుర్తి శ్రీనివాసరావు స్పర్జన రాజ్ తదితరులు పాల్గొన్నారు



## పోలీసు స్టేషన్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**దగదర్తి, జనవరి 26, ప్రభాతవార్త :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని దగదర్తి పోలీసు స్టేషన్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎస్సై జంపాని కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను



దేశభక్తి, క్రమశిక్షణ బాధ్యతలపై ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయక వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, స్థానిక పాటశాల చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర వేడుకలు

**కోట, జనవరి 26 ప్రభాతవార్త :** కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు క్రీడామైదానంలో పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహి ంచారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకు మార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన జాతీయ పతాకాన్ని



ఆవిష్కరించిన అనంతరం ఎన్‌సిసి క్యాడెట్ల నుంచి గౌరవ వంద నం స్వీకరించారు. అధ్యాపకులకు, విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లా డుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొ న్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పోటీల్లో విజేతలకు విజయకుమార్‌రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జు నరెడ్డి, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు. కోట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.జయజయరావు,మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్,పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పవన్ కుమార్,ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లోవార్డెన్ గజేంద్ర,ఉషారాణి జాతీయజెండాలను ఎగుర వేశారు.

### మంత్రి ఆనం క్యాంపు కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నెల్లూరు, జనవరి 26, ప్రభాతవార్త –వైద్యం :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు క్యాంపు కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్ రెడ్డి స్థానిక విద్యార్థులతో కలిసి జాతీయ పతకాన్ని వెగరవేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనం క్యాంపు కార్యాలయ సిబ్బంది, స్థానిక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి పౌరుడు దేశసేవభివృద్ధికి పాటుపడలి : తహశీల్దార్

**కొడవలూరు,జనవరి 26 ప్రభాతవార్త:** బ్రిటిష్ పాలకుల పరిపాలన నుండి విముక్తి పొందిన తర్వాత భారతదేశ పౌరులందరినీ ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలు నడిపించడానికి, స్వాతంత్ర పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేసుకొని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య



రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు.తహశీల్దార్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవంలో జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులచే జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యం గణతంత్ర రాజ్యాంగంగా 26జనవరి 1950న ఏర్పడింది. రాజ్యాంగం ప్రజలందరికీ ప్రాథమిక హక్కులతో పాటు సంపూర్ణ స్వేచ్ఛను, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని, న్యాయాన్ని పూర్తిస్థాయిలో ఒక హక్కుగా కల్పిస్తూ ప్రతి పౌరుడు దేశ సేవకు పాటుపడేలాగా దిశా నిర్దేశం చేసింది.రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వాములైన మహనీయులను నేటి పౌరులు ఆదర్శంగా తీసుకోవాలని ఆమె విద్యార్థులకు తెలిపారు. అలాగే ఎంపీడీవో, సంఘమిత్ర, పోలీస్ స్టేషన్, వివిధ పాఠశాలల్లో కూడా గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి, ఆర్ ఐ హైమావతి, ఏపిఎం కృష్ణవేణి, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు మస్తాన్ బాబు, అశ్విన్, ప్రసన్న, వీఆర్వోలు శ్రీనివాసులు, సుబ్బయ్య,వెంకటేశ్వర్లు, మల్లికార్జున్,యు. సురేష్, షేక్ బాబు, రమేష్, ఏడుకొండలు, షరీఫ్, దేశన్న, ప్రియదర్శిని, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

## గీతాంజలిలో ఘననంగా గణతంత్ర వేడుకలు

**గంగవరం(కోవూరు),జనవరి 26 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో 77వ గణతంత్ర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని పరిరక్షించాల్సిన బాధ్యత నేటియువతరంపై ఉందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులుసామాజిక బాధ్యతను పెంపొందించుకొని దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు



సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని దేశ సాంకేతిక శాస్త్ర ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ప్రత్యేకంగా నిలించింది. అంతకముందు జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీనివాస్,కళాశాల డీన్ డాక్టర్ టీఎన్‌వీఎల్ఎన్ కుమార్, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై. మురళీకృష్ణ,ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్, వివిధ అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## రాజ్యాంగం హక్కుతో ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛ: తహశీల్దార్

**విడవలూరు,జనవరి 26 ప్రభాతవార్త :** మండల కేంద్రం తహశీల్దార్ , ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, మండలంలో అన్ని సచివాలయ కార్యాలయాల్లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్



కె. చంద్రశేఖర్ మాట్లా డు తూ ఎంతో మంది మహనీయులు పోరాట సమరయోధులు రాజ్యాంగాన్ని సాధించి అందులో భారత దేశం లో గణతంత్ర దినోత్సవం గా తీసుకురావడం ఏర్పడింది. దేశంలో ప్రతి పౌరుడు జనవరి 26 గణతంత్ర వేడుకలను జరుపుకుంటారని తెలియజేశారు. అదేవిధంగా గ్రామ సచివాలయంలో జాతీయ జెండా ఎగరవేసి విద్యార్థులచే జాతీయగీతం ఆలపించారు. వావిళ్ళ గ్రామంలో ఉన్న శ్రీ సరస్వతీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రభుత్వ పాఠశాల కూడా గణతంత్ర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరిన్టెంట్ వెంకట రమణమ్మ, మండల సర్వేయర్ శ్రీలత,పంచాయతీ కార్యదర్శి జగదీష్, సరస్వతి ఇంగ్లీష్ మీడియం కస్పాండర్ కౌసల్య, ప్రిన్సిపాల్ మల్లికార్జున్, పలు శాఖ అధికారులు తదితపాల్గొన్నారు.

## నారాయణలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నెల్లూరు, జనవరి 26, ప్రభాతవార్త –వైద్యం** నారాయణ వైద్య విద్యా సంస్థల ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకల్లో నారాయణ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యాపకులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు.



వైద్య విద్యా సంస్థల సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించిన అనంతరం డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేసి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, రాజ్యాంగ బద్ధ పాలనకు తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. దేశభక్తితో ముందుకెళ్లాలని, భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేసి వారిని జ్ఞాపికతో సత్కరించారు. సామాజిక కార్యక్రమాలలో సేవలందిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డీఎం కార్తీక్, ఇతర సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యాసంస్థల ఆపరేషన్స్ హెడ్ డి.రామారావు, నారాయణ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.హరీష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కాంత్, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వంభూలింగేశ్వర స్వామికి విశేష పూజలు

**విడవలూరు,జనవరి 26 ప్రభాతవార్త :** మండల కేంద్రం యలగాలమ్మ గుంట పరిధిలో వెలసియున్న శ్రీ శాంభవి సహిత స్వభూలింగేశ్వరస్వామికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి తైలాభిషేకం, పాలాభిషేకం, కుంకుమార్చన, విశేష పూలఅలంకరణ అలంకరించడంతో స్వామివారు భక్తులకు ఆదిపరమేశ్వర రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు ఆలపించారు.భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మొట్ట మొదటి సారిగా విద్యుత్ శాఖ శకటం

### పీఎం కుసుమ్, పీఎం సూర్య ఘర్, ఆర్డీఎస్ఎస్, కరెంటోళ్ళ జనబాట డయల్



**నెల్లూరు జనవరి 26, ప్రభాతవార్త -వైద్యం** యువర్ సిఎండి పై అవగాహన కొరకు జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల కు,అధికారులకు, సిబ్బందికి రైతులకు 77 వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. కలెక్టర్ ఆఫీస్ అవార్డ్స్, కార్పొరేట్ ఆఫీస్ అవార్డ్స్,విద్యుత్ భవన్‌లో అందుకున్న గ్రహీతలకు శుభాకాంక్షలు.ఎందరో మహానుభావుల కష్ట ఫలితమే ఈ గణతంత్ర దినోత్సవం. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛ యుతంగా ఉన్నామంటే దానికి కారణం మన రాజ్యాంగ వ్యవస్థ అనే తెలిపారు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ ఇవ్వడమే లక్ష్యంగా ప్రతి అధికారి సిబ్బంది పనిచేయాలి రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మన మందరము విజన్ 2047 వైపు అడుగులెయాలి సోలార్ వినియోగంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి పునరుత్పాదక ఇంధన శక్తి గురించి వినియోగదారులకు పూర్తిస్థాయిలో అర్థం అయ్యేలా అధికారులు సిబ్బంది తెలియజేయాలి.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్స్ లక్ష్మీ నారాయణ ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ పరందామయ్య , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి బెనర్జీ,అకౌంట్స్ ఆఫీసర్ శ్రీమతి విజిత డిప్యూటీ ఇంజనీర్స్, అసిస్టెంట్స్ అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ భవన్ లో ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవం వేడుకలు



**నెల్లూరు జనవరి 26, ప్రభాతవార్త -వైద్యం** పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మొట్టమొదటిసారిగా విద్యుత్ శాఖ శకటంపీఎం కుసుమ్,పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, కరెంటోళ్ళ జనబాట మరియు డయల్ యువర్ సిఎండి పై అవగాహన కొరకు జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల కు,అధికారులకు, సిబ్బందికి రైతులకు 77 వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. కలెక్టర్ ఆఫీస్ అవార్డ్స్, కార్పొరేట్ ఆఫీస్ అవార్డ్స్ మరియు విద్యుత్ భవన్‌లో అవార్డ్స్ అందుకున్న గ్రహీతలకు శుభాకాంక్షలు .ఎందరో మహానుభావుల కష్ట ఫలితమే ఈ గణతంత్ర దినోత్సవం. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛ యుతంగా ఉన్నామంటే దానికి కారణం మన రాజ్యాంగ వ్యవస్థ అనే తెలిపారు.వినియోగదారులకు మెరుగైన విద్యుత్ ఇవ్వడమే లక్ష్యంగా ప్రతి అధికారి,సిబ్బంది పని చేయాలి.రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మనమందరము విజన్ 2047 వైపు అడుగులెయ్యాలి. సోలార్ వినియోగంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి పునరుత్పాదక ఇంధన శక్తి గురించి వినియోగదారులకు పూర్తిస్థాయిలో అర్థం అయ్యేలా అధికారులు సిబ్బంది తెలియజేయాలి. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాల చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్స్ లక్ష్మి నారాయణ గారు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ పరందామయ్య గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి బెనర్జీ,అకౌంట్స్ ఆఫీసర్ శ్రీమతి విజిత గారు మరియు డిప్యూటీ ఇంజనీర్స్, అసిస్టెంట్స్ అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం చాలా గొప్పది

### జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా



**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త** ప్రపంచంలోనే అతిపెద్ద లికిత పూర్వక రాజ్యాంగం భారత రాజ్యాంగం అని ,భారత రాజ్యాంగం చాలా గొప్పదని జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు పేర్కున్నారు. బుచ్చిరెడ్డి పాళెంలోని 5 వ సచివాలయంలో కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ,బిట్రగుంట ప్రమీలమ్మ ముఖ్య అతిధులుగా పాల్గొని ము వ్వన్నెల జెండాను ఎగుర వేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏటా జనవరి 26 వతేది దేశవ్యాప్తంగా స్వాతంత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటాం.బాబు రాజేంద్రప్రసాద్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులు రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ఎంతో కృషి చేశారని ఆయన కొనియా డారు. రాజ్యాంగం వల్లనే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామని అన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో కోవూరు నియోజకర్గం అన్ని విధాలా అభివృద్ధి చెం దుతుందని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి మిఠాయిలు పంచిపె ట్టారు.కార్యక్రమంలో సెక్రటరీ మొహుద్దీన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## 100 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించిన రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు



**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త** 77 వ గణతంత్ర దినోత్సవ సంబరాలు పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ముంబాయి రహదారిలో దేశభక్తి గీతాలు ఆలపిస్తు ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ చిట్టిబాబు ఆద్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కుమార్‌రెడ్డి మాట్లాడుతు భారత రా జ్యాంగం చాలా పెద్దదని చెప్పారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగం గురించి చిన్నతనం నుండే తెలుసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిం చారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిఫల్ ఇలియాజర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా స్వామ్యాన్ని పరిరక్షిద్దాం : చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి జనవరి 26 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ కార్యాలయంలో 77 వ గణతంత్ర వేడుకలు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఆమె కమిషనర్ డి.బాలకృష్ణా, కౌన్సిల ర్లలు,కో ఆప్షన్ మెంబర్లుతో కలిసి ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పట్టణ ప్రజానికానికి శుభాకాంక్షలు తెలి పారు. సచివాలయ సిబ్బందికి పురస్కారాలు అంద జేశారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జనవరి 26 భారత రాజ్యాంగాం అమలు చేసిన రోజు అని ఆమె తెలిపారు. నేటి తరం వారు అసలు రాజ్యాంగం అంటే ఏమిటి అని తెలుసుకోవాలని అన్నారు.ప్రజా స్వామ్యాన్ని పరి రక్షించాల్సిన భాధ్యత మనందరి మీద ఉందని అన్నారు.కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపివేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బుచ్చి నగరపాలక పంచాయితీని మరింత అభివృద్ధి చేసుకుం దామని ఆమె సూచించారు. ఈ సందర్భంగా నగరపాలక పంచాయితీలో శానిటేషన్, వాటర్‌వర్క్, విద్యుత్,మెప్మా తదితర విభాగాలలో ప్ర తిభ కనబరచిన వారికి ఆమె ప్రతిభాపురస్కారాలుఅందజేశారు. అధికారులు,మున్సిఫల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో 'ఎగురని' జండా



**కలిగిరి, జనవరి26, ప్రభాతవార్త;** భారత రాజ్యాం గాన్ని రచించిన రోజుజున వావవాడల్లో జండా పండు ఘను ఘ నంగా నిర్వహించినా కలిగిరిమండల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో మాత్రం గణతంత్ర దినోత్సవం సం దర్భం గా జండా ఎగురలేదు. అది చూసిన ప్రతి ఒక్కరూ వీళ్లే మైనా ప్రత్యేకమా. వీరు రాజ్యాంగ పరిదిలోకి రారా! అంటూ గుసగుసలాడుకుంటున్నారు. ఈకార్యాలయం ఎక్కడో మారు మూల ప్రాంతంలో అయితే ఎవ్వరూ పట్టించుకునే వారేకాదు. ఈవిషయం ఎవ్వరికీ తెలిసేదీకాదు. కానీ నేషనల్ హైవేరోడ్డు పక్కన,అన్ని మండల కార్యాలయాల మధ్యనదిబూసినట్లుగా ఉండడంతో చూసినవారు ఇదిమేటయ్యా! ఇదిమేమ్కొడా చూడలేదే! అంటూ గుసగుసలాడుకుంటారు. అంతేకగా మరి!!

## అదానీ కృష్ణపట్నం పోర్ట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**ముత్తుకూరు, జనవరి 26, ప్రభాతవార్త** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం అదానీ కృష్ణపట్నం పోర్ట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోర్ట్ సిఈఓ జగదీష్ పటేల్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ అన్ని కొత్త ప్రక్రియలు, వ్యవస్థలకు కట్టుబడి కృష్ణపట్నం నౌకాశ్రయం కూడా బాగా పనిచేస్తోందని తెలిపారు. దీంతో కృష్ణపట్నం నౌకాశ్రయం 2025 సెప్టెంబరులో ఖనిజ కార్గో నిర్వహణలో ఒక మైలురాయిని సృష్టించింది. ఇది 2025లో అత్యధిక ఇనుప ఖనిజం మరియు ఎరువులను కూడా నిర్వహించిందని ఆయన అన్నారు. అందువల్ల, కృష్ణపట్నం నౌకాశ్రయం ఏపి సెజ్ ఉత్తమ వినూత్న ప్రాజెక్ట్ అవార్డు 2025ను అందుకుంది. ఇది 11వ కన్వెన్షన్ ఆఫ్ క్వాలిటీ కాన్సెప్ట్ 2025లో ఎనిమిది బంగారు పతకాలను కూడా అందుకుంది. దీనిని క్యూసిఎఫ్ఐ తిరుపతిలో రైజింగ్ స్టార్ ఆర్గనైజేషన్ అవార్డుతో సత్కరించారు. ఇది 19వ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛాంపియన్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ 2025 అవార్డును కూడా గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో సీఈఓతో పాటు ఆయన సతీమణి చాందిని పటేల్, కుమారుడు యష్ పటేల్‌తో పాటు శాఖల అధిపతులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకున్న అధికారులు











**నెల్లూరు, జనవరి 26, ప్రభాతవార్త -వైద్యం** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుండి ఉత్తమ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్న జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం. ఈ సందర్భంగా రాఘవేంద్రం మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి జిల్లాలోని అందరూ అధికారులు, సిబ్బంది టీం వర్క్‌గా పని చేయడంవల్లే ఈఅవార్డు రావడం జరిగిందని తెలియజేశారు. అలాగే కలెక్టర్ ఆఫీసు అవార్డు అందుకున్నఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కావలిబెనర్జీకి డిప్యూటీ ఇంజనీర్ ప్రభాకర్‌కి, ఇంజనీర్ లక్ష్మీబాయికి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ మహేష్‌కి, రామ్మోహన్ పీసీకి శుభాకాంక్షలు తెలిపారు.



## పెంచల ప్రసాద్‌కు ఉత్తమ అవార్డు అందజేత



**సైదాపురం, జనవరి 26, ప్రభాతవార్త** సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలకు సంబంధించి స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తున్న వై.పెంచల ప్రసాద్‌కు విధి నిర్వహణలో విశేష సేవలు అందించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులో జిల్లా కలెక్టర్,జిల్లాఎస్పీల చేతుల మీదుగా ఉత్తమఅవార్డు అందు కున్నారు.పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## 27న జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన : జిల్లా కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** రాష్ట్ర ఇంధన/విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈనెల 27న నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 (మంగళవారం) ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పుట్టవరిపాలెం గెస్ట్ హౌస్ నుంచి ఉదయం 8.00 గంటలకు బయలుదేరి, ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని మగుంట లేఅవుట్‌లో ఉన్న ఎంపీ నివాసానికి చేరుకుంటారు. ఉదయం 11.00 గంటలకు అక్కడి నుండి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు బుచ్చిరెడ్డిపాలెం మండలం పాంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.00 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.00 గంటలకు పాంచేడు నుంచి బయలుదేరి, మధ్యాహ్నం 1.30 గంటలకు మగుంట లేఅవుట్‌లోని ఎంపీ నివాసంలో స్వల్ప విరామం తీసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు నెల్లూరు నుంచి ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామానికి బయలుదేరి, మధ్యాహ్నం 3.30 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తారు.సాయంత్రం 5.00 గంటలకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కోవ్వూరు వద్ద ఏర్పాటు చేయనున్న విద్యుత్ డివిజన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం రాత్రి 8.00 గంటలకు కుడితిపాలెం చేరుకుని అక్కడి నుంచి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కలెక్టర్‌చే దివ్యాంగులకు ల్యాప్టాప్, స్మార్ట్ ఫోన్లు పంపిణి




**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని అర్హులైన దివ్యాంగులలో బదిరుల క్యాటగిరి నందు ఇంటర్మీడియట్, ఆపై విద్యార్హత కలిగిన 20 మందికి ఒక్కొకటి 15000 రూపాయలు విలువగల 20 స్మార్ట్ ఫోన్లు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగులకు ఒక్కొక్కటి 42000 రూపాయలు విలువగల ఐదు ల్యాప్టాప్‌లు, శారీరక వైకల్యం గల దివ్యాంగులకు 2 వీల్ చైర్లు పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినదిని జిల్లా విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ. మహమ్మద్ అయూబ్ ప్రకటనలో తెలియజేశారు.

## కలెక్టర్‌చే విశిష్ట సేవలకు ప్రశంసాపత్రం



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** జిల్లా పౌర సమాచార శాఖ కార్యాలయంలో సుమారు 40 దశాబ్దాలుగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సహాయకులు ఖాదర్ మస్తాన్ తమ విశిష్ట సేవలు తమ శాఖకు అందించినందుకు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదగా ఖాదర్ మస్తాన్‌కు ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది.

## జనసేన జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,జనవరి26 ప్రభాతవార్త-విద్య** సోమవారం నగరంలోని స్థానిక గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆపార్టీ కోర్ కమిటి సభ్యులు నూనమల్లిఖార్జునయాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నూనెమల్లి ఖార్జునయా దవ్,పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి గునుకుల కిషోర్‌లు మాట్లాడుతు జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను జరపుకోవటం సంతోషంగా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఫలాలలను అందరికి అందేలా చేసేందుకు తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో పాటూ నాయకులం అందరం పాటుపడుతున్నామన్నారు. దేశ సైనికబలాల శక్తి, దేశ హైందవత్వం ప్రపంచ దేశాలకు తెలిసేలా చేయటం గర్వకారణమన్నారు. తమ పార్టీ అధినేత ఆశయ సాధనలో బాగంగా జిల్లాలో పార్టీ బోపేతానికి అందరూ కృషిచేయ్యాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి రవికుమార్, కృష్ణారెడ్డి, గుర్రం కిషోర్‌బాబు, ప్రసాద్‌యాదవ్, ప్రశాంత్ గౌడ్ , వీరమహిళలు పాల్గొన్నారు.

## ఓవెల్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు,జనవరి26 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని ఓవెల్ పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విఎస్‌యూ ఎంబిఏ అదనపు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ పి. సుజాత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతు విద్యార్థులు అందరూ చిన్న తనం నుండే దేశభక్తి, సహాయ గుణం కలిగి ఉండాలన్నారు. సమాజం పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్ రంగిశెట్టి వేణు, సిఈఓ ప్రమీల, జిఎం మహదేవయ్య, ఈడి బాలు, డిజిఎం రఫీ, మీనాక్షి, గిరిధర్, రాజేశ్వరి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**గూడూరు, జనవరి 26, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఇంచార్జ్ ఆర్డిఓ అనూష జాతీయ జెండాను ఆవిష్కరించారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఇంచార్జ్ ఆర్డిఓ అనూష ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు అనంతరం జరిగిన సమావేశంలో ఇంచార్జ్ ఆర్డిఓ అనూష మాట్లాడుతూ పలు శాఖల ద్వారా గూడూరు డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ప్రజలందరి సహకారంతో జిల్లాలోని డివిజన్ మంచి గుర్తింపు సాధించాలని అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ శాఖలలో పనిచేస్తున్న అధికారులకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందించారు. అదే విధంగా పాఠశాలలో ఆటలుపోటీ నిర్వహించి గెలుపొందిన వారికి ప్రైసులు కూడా పంపిణీ చేసారు. తాసిల్దార్ ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వర్లు, డిఎల్‌పిఓ వాణి, డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ కాంచన, ఎలక్ట్రికల్ ఈఈ నరేందర్ రెడ్డి, నాయకులు కిరణ్ కుమార్, చెంచురామయ్య, రహీం, ఆరికట్ల మస్తాన్ నాయుడు చంద్రమౌళి, శ్రీధర్, పెంచలయ్య, సురేంద్ర, పార్వతయ్య, ప్రభుత్వ హాస్పటల్ సూపరింటెండెంట్‌షారేనా, ఏహెచ్‌శిరీష, పలుశాఖల అధికారులువిద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరు గణతంత్ర వేడుకల్లో విదేశీయులు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26,ప్రభాతవార్త** నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో విదేశీ యులు సందడి చేశారు. స్పెయిన్ దేశానికి చెందిన జువాన, యానాను వేడుకల్లో పాల్గొన్నారు. గమేష కంపెనీలో గల సిమె న్స్ కంపెనీ తనకికి విచ్చేసిన వారు దేశ గణతంత్ర వేడుకలు తెలుసుకొని తిలకించేందుకు వచ్చారు.వేడుకలకు సంబంధించి ఆనందం వ్యక్తం చేశారు. వారి వెంట కంపెన్ డిప్యూటీ మేనేజర్ అరుణ ఉన్నారు.

## విశిష్ట సేవలకు సమాచార శాఖ డిడికు ప్రశంసా పత్రం

### జిల్లా కలెక్టర్ శుక్లచే డీడీ వేణుగోపాల్ రెడ్డి కు ప్రశంసాపత్రం



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 26, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పౌర సమాచార శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డికు తమ విశిష్ట సేవలుగాను 77వ గణతంత్రదినోత్సవం సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకలలో జిల్లాకలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదగా జిల్లా, జిల్లా సమాచార శాఖడిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి ప్రశంసాపత్రం అందించడం జరిగింది.

## కోర్టులో ఘనంగా గణతంత్ర వేడుకలు



**కోవూరు, జనవరి 26ప్రభాతవార్త :** కోవూరులోని సెషన్స్ కోర్టులో సోమవారం 77వ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి. చైతన్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలోని రాజ్యాంగం ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాల్లో కెల్లా ఎంతో గొప్పదని కొనియాడారు. వందేమాతరం గీతం ఆలపించారు. స్పెషల్ మేజిస్ట్రేట్ కృష్ణయ్య, న్యాయవాదులు సునీ ల్‌కుమార్, గాదిరాజు భాస్కర్‌రావు, మధుసూదన్‌రావు, ఎం. రవీంద్ర, జె.శేషమ్మ, సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, శ్యామాచార్యులు, చెన్నయ్య,రవిరాజ,ఎంవీ రమణయ్య,ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## మండలంలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు



**కోవూరు, జనవరి 26ప్రభాతవార్త :** కోవూరు మం డలంలో సోమవారం77వ గణతంత్ర వేడుకలు ఘ నంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మురళి మండల పరిషత్ కార్యాలయంలోఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో డీఈ శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ కార్యాలయంలో మోహన్‌రావు, వ్యవసాయశాఖ కార్యాలయంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, కోవూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ కిషోర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు రహీమ్ , వై. చెంచులక్ష్మమ్మలు మువ్వన్నల జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా తహసీల్దారు మా ట్లాడుతూ 77 వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకొన్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని ఆయన పేర్కొన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు , సీనియర్ అసిస్టెంట్‌లు శ్రీనాథ్, రమణయ్య, ఆర్ఐ చైతన్య , సర్వేయర్ రమేష్ గౌడ్, తదితరులు మండలంలోని అన్ని గ్రామాల గ్రామరెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## షటిల్ విజేతలకు బహుమతులు పంపిణీ



**కోవూరు, జనవరి 26ప్రభాతవార్త :** కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షటిల్ కోర్టులో గత రెండు రోజులుగా నిర్వహించిన షటిల్ విజేతలకు సోమవారం సీనియర్ సివిల్ జడ్జి చైతన్య బహుమతులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తి కలిగి ఉండి గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. రిటైర్డ్ ఏజీపీ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని తువ్వర జోయల్ సుహాస్, బండికాల హిమకర్‌లు కైవసం చేసుకున్నారు. రెండవ బహుమతి పదవల చంద్రమౌళి కార్తీక్, పిడుగు విఘ్నేష్‌లు, మూడవ బహుమతిపి గుండాల లక్ష్మీ సోను, గుండాల అజయ్‌లు కైవసం చేసుకున్నారు. వీరికి మెమెంటోలు పతకాలను పంపిణీ చేశారు. కోవూరు షటిల్ అసోసియేషన్ సభ్యులు రామిశెట్టి కోనా రాయల్, పొంగూరు రవితేజ, బొడ్డు శ్రీనివాసులు, కె. దయాకర్, కె. బాలకృష్ణ, కె. శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## న్యూలిటిల్ ఫ్లవర్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



**కోవూరు, జనవరి 26ప్రభాతవార్త :** కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు కరస్పాండెంట్ వై. నందకిషోర్, అనితలు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక దశనుంచి దేశ భక్తిని అలవరుచుకోవాలన్నారు. దేశం మనకేమిచ్చింది కాకుండా దేశానికి మనం ఏమి ఇవ్వాలి అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈడాక్ టాలెంట్ ఓపీఆర్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అభిషాంత్, మనోజ్‌కుమార్‌లు హాజరై పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ డాక్ ఇగ్నైట్ 4.0లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్న ఎస్‌కే కషఫ్ అలీ, సంగీతంలో టి. షణ్ముఖ లహరిలకు బంగారు పతకాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కోటయ్య, ఇన్‌చార్జి విజయలక్ష్మి, బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

## కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు నందు ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నెల్లూరు, జనవరి 26, ప్రభాతవార్త -వైద్యం** గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు నందు 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి దేశ ఐక్యతపై ప్రసంగాలు నిర్వహించారు. మాట్లాడిన వైద్యులు, సిబ్బంది దేశ అభివృద్ధిలో ఆరోగ్య సేవల పాత్రఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే రాజ్యాం గాన్ని గౌరవిస్తూ, వృత్తిపరమైన నిబద్ధతతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో డాక్టర్లు నర్సింగ్ సిబ్బంది ఆఫీసు సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది పాల్గొని గణతంత్ర దినోత్సవ శుభకాంక్షలు తెలిపారు. దేశ ఆరోగ్యం, సమాజ సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ, రాజ్యాంగ ఆత్మను ఆచరణలో పెట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ఐక్యత, కర్తవ్య భావన మరింత బలపడాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.